క్లుప్తంగా

అన్నసమారాధన



భక్తులకు అన్నం వడ్డిస్తున్న చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: గ్రామంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర పచ్చదనం , సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అన్నసమారాధనలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర్ (శివ), సత్యం వెంకట రమణ, దేవులపల్లి సరితారాణి, పుట్టా పరేష్ నాథ్, పసుపులేటి దేవి పాల్గొన్నారు.

విశ్రాంత డీఎల్‌పీవో సత్యనారాయణకు నేడు సన్మానం



జాన సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాకు తొలి జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా బాధ్యతలు నిర్వహించి, గత నెల 30వ తేదీన నరసాపురం డీఎల్‌పీవోగా పదవీ విరమణ చేసిన జాన సత్యనారాయణకు ఆదివారం బొమ్మూరులోని చెరుకూరి కన్వెన్షన్‌లో ఆత్మీయ అభినందన సన్మాన సభను ర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ విస్తరణాధికారుల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. విశిష్ట అతిథిగా కలెక్టర్ కె.మాధవీలత, ప్రత్యేక అతిథిగా జిల్లా గ్రామపంచాయతీ అధికారి దాసరి రాంబాబు పాల్గొంటారు.

వేసవి శిబిరానికి విశేష స్పందన

ప్రకాశం నగర్: గౌతమీ ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరానికి అనూహ్య స్పందన లభిస్తోందని గ్రంథాలయాధికారి ఘంటా శ్రీదేవి తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ ఉదయం ఎనిమిది గంటల నుంచి కథలు చదివించడం, పుస్తక పఠనం, వివిధ ఆటలు ఆడించడం, ఒక మంచి పుస్తకంపై సమీక్ష, అనంతరం స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్స్, వేద గణితం వంటి వివిధ అంశాలను పిల్లలకు నేర్పిస్తున్నామన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి మొదలైన శిక్షణ కార్యక్రమాలు జూన్ 7 వరకూ జరుగుతాయన్నారు.

తెలంగాణ ఈఏపీ సెట్‌లో 134వ ర్యాంకు



కర్రి కుష్వంత్ రెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కవలగొయ్యిలోని ది ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్ విద్యార్థి కర్రి కుష్వంత్ రెడ్డి తెలంగాణ ఈఏపీసెట్‌లో 134వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. ఆ విద్యార్థిని పాఠశాల డైరెక్టర్ యేలేటి రవిబాబు, చైర్ పర్సన్ యేలేటి విజయ, ప్రధానోపాధ్యాయుడు శేషగిరిధర్, డీన్ హర్షిణి అభినందించారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కడియం: చిన్ననాటి నుంచే ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని హెల్త్ సూపర్ వైజర్ కృష్ణవేణి అన్నారు. స్థానిక గ్రంథాలయాధికారి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నాలుగో రోజు శనివారం చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది కార్యక్రమానికి హాజరై చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలిపారు. అంతకుముందు మహనీయుల జీవిత విశేషాలు, వైజ్ఞానిక పుస్తకాల గురించి వివరించారు. తెలుగు వ్యాకరణంపై శిక్షణ నిచ్చారు. విరామ సమయంలో అల్పాహారం అందించారు.

సినిమాలు



శ్యామల	: ఆ ఒక్కటీ అడక్కు
సూర్యమినీ	: కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
సూర్యప్యాలస్	: అపరిచితుడు
స్వామి	: కృష్ణమ్మ
శివజ్యోతి	: గీతాంజలి మళ్ళీ వచ్చింది
అనుశ్రీ	: ది గ్యారీఫీల్డ్ మూవీ
రాజా	: రత్నం
ఊర్వశి	: బాక్
రంభ	: మిరల్
మేనక	: నటరత్నాలు, ప్రసన్నవదనం
అప్సర	: కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
కుమారి	: దర్శిని, రత్నం
నామవరం	
వీఎస్ మహల్	: కృష్ణమ్మ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: అపరిచితుడు, కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
కడియం	
వెంకటసూర్య	: ఆ ఒక్కటీ అడక్కు

కల్యాణ వైభోగమే..



వేణుగోపాలస్వామి

- వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధం
- నేటి నుంచి 24 వరకూ మహోత్సవాలు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, రుక్మిణీ, సత్యభామ కల్యాణోత్సవానికి సర్వంసిద్ధమయ్యాయి. స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. అందులో భాగంగా తొలిరోజు ఆదివారం రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుంది. ఈ మేరకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో తరలి వచ్చే భక్తులకు అనుగుణంగా వసతులు కల్పించారు.

స్థల పురాణం

గోదావరి గట్టున గల వేణుగోపాలస్వామి ఆలయం పూర్వకాలం నుంచీ దివ్యక్షేత్రమై విరాజిల్లుతోంది. చరిత్ర ప్రకారం.. 13వ శతాబ్దానికి ముందుగానే పరాశర మహర్షి గోదావరీ తీర ప్రాంతంలో ప్రతిష్ఠించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం అర్చనాది కైంకర్యాలు జరుగుతూ ఉండేవి. 13వ శతాబ్దంలో మహ్మదీయుల దండయాత్రలో భాగంగా దేవస్థానాలను ధ్వంసం చేస్తున్నారని తెలుసుకుని అప్పటి అర్చక స్వాములు శ్రీస్వామివారి మూల విరాట్‌ను గోదావరి తీరంలో దాచారు. అనంతరం 17వ శతాబ్దంలో వేణుగోపాలస్వామి, శ్రీలక్ష్మి నృసింహస్వామి, వెంకటేశ్వరస్వామి వార్ల ఆలయాలు, విమానత్రయం, ముఖమండపం, కళ్యాణ మండపం, ప్రాకరాలను రాజా వెంకటరాయలు నిర్మించారు. స్వామివారి అర్చనాది కార్యక్రమాలు వైఖానస ఆగమం ప్రకారం ఖండవల్లి వంశీకులతో నేటికి జరుగుతున్నాయి.

నేడు స్వామివారి కల్యాణం

కల్యాణ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమవుతాయి. తొలిరోజు స్వామివారికి తిరువీధి ఉత్సవం, రాత్రి 8 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. సోమవారం నిత్యహోమం, 21న సదస్యం, 22న స్వామి వారి రథోత్సవం , 23న స్వామివారికి చక్రతీర్థం, 24న స్వామి వారికి పుష్పయాగోత్సవం జరుగుతాయి.

పూర్తయిన ఏర్పాట్లు

క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆదివారం నుంచి 24వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయి. పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తులకు అనుగుణంగా వసతులు కల్పించారు.



వేణుగోపాలస్వామి వారి ఆలయం

సెంట్రల్ జైలులో సదుపాయాల పరిశీలన

కంబాలచెరువు: నల్సా ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు శనివారం సందర్శించారు. కారాగారంలోని ఖైదీల జీవన పరిస్థితులు, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, బ్యారక్స్‌లోని వాష్ రూమ్‌లు, మురుగునీటి నిర్వహణ, వాటర్ ట్యాంకులు, ఖైదీల భద్రత, ఆహార ప్రమాణాలు, వసతులు, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అన్నారు. వారి తరఫున వాదించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఈ సేవలను అందరూ వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి న్యాయ సమస్యలున్నా పారా లీగల్ వలంటీర్ల ద్వారా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా డీఎల్ఎస్ఏకు తెలియజేయాలన్నారు. ఖైదీలందరూ పరివర్తన చెంది న్యాయబద్ధమైన జీవనశైలిని అలవరుచుకోవాలన్నారు. కారాగారంలోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. వృత్తి నైపుణ్యతకు ఖైదీలకు మరింత శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే జిల్లా న్యాయసేవాధికార సంస్థ నియమించిన పారా లీగల్ వలంటీర్లతో మాట్లాడారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి తెలియజేయాలని, సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

స్త్రీల స్వేచ్ఛ కోసం పోరాడిన మహనీయుడు చలం



చలం చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు తదితరులు

సీటీఆర్ఐ: స్త్రీ జాతి చైతన్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు చలం అని తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ, కళా గౌతమి సంయుక్తంగా శనివారం గుడిపాటి వెంకటాచలం జయంత్యుత్సవం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంజీవరావు మాట్లాడుతూ మన మనసులోకి తొంగి చూసుకుంటే, మనలో ఉన్న చలం కనిపిస్తాడని తెలిపారు. స్వాతంత్రోద్యమ కాలంలోనే సమాజంలో పురుషులతో పాటు స్త్రీలకు కూడా హక్కులు, స్వేచ్ఛ ఉండాలని తన రచనల ద్వారా పోరాటం చేసిన స్త్రీవాద కవి చలం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు మాట్లాడుతూ ప్రస్తుతం స్త్రీలు ఇంత స్వేచ్ఛగా ఉండగలుగుతుందంటే ఆనాటి మహాపురుషుల త్యాగ ఫలితమేనన్నారు. ఐక్యూఎస్సీ కో ఆర్డినేటర్ డాక్టర్ వై.స్వర్ణశ్రీ మాట్లాడుతూ స్త్రీకి చదువు అవసరం లేదని సమాజం భావించే ఆ కాలంలోనే గుడిపాటి వెంకటాచలం తన భార్యను పాఠశాలలో వదిలి, తాను కాలేజీకి వెళ్లేవారన్నారు. నాటి నుంచీ స్త్రీల అభ్యున్నతికి అనేక రచనలు చేశారన్నారు. అకాడమిక్ కో ఆర్డినేటర్ జి.శరత్ బాబు మాట్లాడుతూ స్త్రీకి కూడా మనసు ఉంటుందని, తన అభిప్రాయాలను గౌరవించే వారితోనే నడవగలుగుతుందని బహిరంగంగా చాటిన వేదాంతి చలం అన్నారు. కార్యక్రమంలో హితకారిణి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చీర్ల సీతారామ నాయుడు, ఇందిర, రాజబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాన్ రాజ్ మృతితో బొమ్మూరులో విషాద ఛాయలు



కుడిపూడి జాన్ రాజ్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జేఎల్‌బీ నగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కుడిపూడి వీర్రాజు ఎలియాస్ జాన్ రాజ్ (62) మృతితో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎన్నికల నేపథ్యంలో గత 40 రోజులుగా ఆయన ముమ్మరంగా ప్రచారం చేశారు. తన బుల్లెట్‌కు రెండు పెద్ద జెండాలు కట్టుకుని గ్రామ వీధుల్లో రయ్‌రయ్‌మని తిరిగారు. వైఎస్సార్ సీపీ నాయకుడిగా యువకులతో పోటీ పడి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయన మృతిని వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, న్యాయవాది గౌందేశి శ్రీనివాసులు రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని సందర్శించారు. జాన్ రాజ్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



జాన్ రాజ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

చందన నాగేశ్వర్ పరామర్శ

బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌లోని జాన్ రాజ్ కుటుంబ సభ్యులను శనివారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ జాన్ రాజ్ కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఏ అవసరం వచ్చినా తాను, పార్టీ నాయకులు అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ముందుగా జాన్ రాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, పార్టీ నాయకులు మత్సేటి శివ, ఎలుగొండ లక్ష్మి, కొమ్మన కోటి, కేవీ సుబ్బారెడ్డి, తోడేటి రాహుల్, జాలా కృపారావు, సత్యవతి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మతం పేరుతో ప్రధాని మోదీ రాజకీయాలు

ప్రకాశం నగర్: ప్రధాని నరేంద్ర మోదీ మతం పేరుతో రాజకీయాలు చేస్తున్నారని, మతోన్మాదంతో ప్రజలను రెచ్చగొడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అయోధ్య రామమందిరం కూలిస్తారంటూ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో ప్రజలను మభ్యపెట్టడానికి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని, కులాన్ని, మతాన్ని ఉపయోగించి ఓట్లు పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ముస్లింలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఇస్తారని చెప్పడం దారుణమని మండిపడ్డారు కేంద్రంలో ఎన్‌డీఏ, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాలు కూలిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే అది బీజేపీతో పొత్తు వల్ల కాదని, వైఎస్సార్ సీపీ వ్యతిరేక ఓటుతోనేనని చెప్పారు. సిట్ సమగ్రంగా విచారణ జరిపి, రాష్ట్రంలో శాంతిభద్రతలను అదుపులోకి తీసుకుని రావాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

సహజ యోగాతో ఒత్తిడి దూరం

ప్రకాశం నగర్: నేటి సమాజంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక, శారీరక ఒత్తిడిని తేలికగా అధిగమించి, జీవితంలో ఉన్నత శిఖరాలు చేరేందుకు సహజ యోగా ధ్యానం ఉపయోగపడుతుందని ఆంధ్రప్రదేశ్ సహజ యోగా కో ఆర్డినేటర్ కల్లూరు రామకృష్ణ అన్నారు. స్థానిక వి కన్వెన్షన్ హాలులో శనివారం ఎస్ఎస్‌పీటీ వర్క్ షాప్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మహారాష్ట్రకు చెందిన నేషనల్ ఆర్డినేటర్ మహేష్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలోని పలు విద్యా సంస్థలలో సహజ యోగా పరిచయ కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరంలో వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దక్షిణ భారత కో ఆర్డినేటర్ కల్లూరు సుభాషిణి మాట్లాడుతూ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా సహజ యోగా పరిచయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఈ-కేవైసీకి 31 వరకూ గడువు

సీతానగరం: గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవడానికి ఈ నెల 31వ తేదీ వరకూ గడువు ఉందని సీతానగరంలోని జయ రోహన్ ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ అధినేత సూరెడ్డి శివకుమార్ శనివారం తెలిపారు. గ్యాస్ వినియోగదారులు ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, లీజు ఒప్పందం, ఓటరు ఐడీ కార్డ్, పాస్‌పోర్ట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన గుర్తింపు కార్డులు, ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలలో ఏదో ఒకటి చూపి గ్యాస్ ఏజెన్సీలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. లేకపోతే ప్రభుత్వ సబ్సిడీలు వర్తించవన్నారు.

వాసవీమాత గ్రామోత్సవం



ధవళేశ్వరంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు



రాజమహేంద్రవరంలో 102 కలశాలతో ఊరేగింపు

ధవళేశ్వరం: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా శనివారం రాత్రి ధవళేశ్వరంలో గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం కన్యలతో కుంకుమ పూజ చేశారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కడియంలో రథోత్సవం

కడియం: మండల కేంద్రమైన కడియంలో వాసవీ మాత రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. కేరళ వాయిద్యాల నడుమ పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వాసవీ మాత జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా గ్రామాల్లోని సంఘీయులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా ఆర్యవైశ్యులు తమ వ్యాపార లావాదేవీలను నిలిపివేసి ఆయా కార్యక్రమాలకు హాజరయ్యారు.

రాజమహేంద్రవరంలో..

ప్రకాశం నగర్: వాసవీ జయంతి సందర్భంగా శనివారం స్థానిక వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 102 కన్యలు 102 కలశాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముగిసిన ఎస్టీయూ శిక్షణ తరగతులు

రాజానగరం: ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి నాయకులుగా ఎదిగి, దేశాన్ని, సమాజాన్ని ప్రభావితం చేసిన వారు ఎందరో ఉన్నారని, అటువంటి వారి సేవలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావం వంటి లక్షణాలు ఉన్నవారే మంచి నాయకులుగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి, ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

తంటికొండ వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం



తంటికొండలో పందిరి రాట వేస్తున్న ఈఓ వెంకటలక్ష్మీకుమార్, అర్చకులు

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈఓ గండి వెంకటలక్ష్మీకుమార్ ఆధ్వర్యంలో పండితులు ఉదయం నుంచి స్వామి, అమ్మవార్ల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కూతురుగా చేసి పందిరి రాట వేశారు. విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ఏడు గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్టు ఈఓ తెలిపారు.

376 మందికి వైద్యసేవలు



చినకొండేపూడిలో వైద్యసేవలు పొందుతున్న ప్రజలు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి -1 పరిధిలో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 376 మందికి సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు వైద్యసేవలు అందించారు. అవసరమైన పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ చిన్నారి, ఏఎన్ఎం విశాలి, ఆశావర్కర్లు కుమారి, రాణి, సంధ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రాప్తిరస్తు

- గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు
- ఉత్సాహంగా తరలి వస్తున్న విద్యార్థులు

రంగంపేట: గ్రంథాలయాలు రా రమ్మని పిలుస్తున్నాయి. ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. సెలవులను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీసేందుకు శిబిరాలు దోహదపడుతున్నాయి. పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించేందుకు స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం జూన్ 7 వరకూ కొనసాగనుంది. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ తరగతులు జరుగుతున్నాయి. విజ్ఞానం, వినోదం, సాహిత్యం, చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, ఇంగ్లిష్, భావ వ్యక్తీకరణ తదితర అంశాల్లో పట్టు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. పిల్లలకు ఆసక్తి కలిగించే పలు పుస్తకాలు అందుబాటులో ఉంచారు. బాల సాహిత్యం, దేశ నాయకుల జీవిత చరిత్రలు, దేశభక్తి పెంపొందించే పుస్తకాలు చదవడానికి ప్రాధాన్యమిస్తున్నారు. విద్యార్థులు శిబిరానికి రాగానే నచ్చిన పుస్తకాన్ని చదివిన తరువాత మిగిలిన తరగతులు ప్రారంభిస్తున్నారు. స్టోరీ టెల్లింగ్ (ఆకట్టుకునేలా కథలు చెప్పడం), నీతి కథలు తదితర అంశాల్లో తర్ఫీదునిస్తున్నారు. రోజుకో అంశంలో చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, పాటలు పాడటం, నృత్యం తదితర అంశాల్లో నిపుణులు, విశ్రాంత ఉపాధ్యాయులతో తరగతులు చెప్పిస్తున్నారు. శిబిరానికి హాజరైన విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు, అరటి పండ్లు అందిస్తున్నారు.



రంగంపేట శాఖా గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు